క్లుప్తంగా

నేడు పట్టాల పంపిణీ

సాలూరు: ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర చేతుల మీదుగా డీపట్టా భూములకు సంబంధించి ఆయా రైతులకు సోమవారం పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ బాల మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, మండలంలోని సారిక పంచాయతీలో జరగనున్న కార్యక్రమంలో 86 మంది లబ్ధిదారులకు 76 ఎకరాల 69 సెంట్ల భూమికి సంబంధించి పట్టాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి


మృతి చెందిన ఆవు

బలిజిపేట: మండలంలోని పలగర గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లు తగిలి ఆవు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుడు పడాల గంగులుకు చెందిన ఆవు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్లగా ప్రమాదం జరిగినట్లు చెప్పారు.

బడ్జెట్ సమావేశం రేపు

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 28న ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి ఆదివారం తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్, 2024–25కు సంబంధించి అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. మండలంలోని ఎంపీటీసీలంతా హాజరుకావాలని కోరారు.

వైభవంగా గాయత్రీ యజ్ఞం

భామిని: మండలంలోని పసుకుడి రామమందిరం ప్రాంగణంలో ఆదివారం హరిద్వార్ గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. తొమ్మిది కుండలీలలో హోమాదికాలు, జపాలు చేశారు. స్థానిక గాయత్రీ పరివార్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, నేరడి–బి, సొలికిరి, పెద్దదిమిలి, నులకజోడు సత్యసేవా సంఘాల సభ్యులు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పసుకుడి గ్రామంలో అన్న సంతర్పణ చేశారు.

30న ఉచిత మెగా వైద్యశిబిరం

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లిలో ఈనెల 30న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక సర్పంచ్ బి.మహేశ్వరరావు ఆదివారం తెలిపారు. శ్రీసత్యసాయి బాబా మందిరం ప్రాంగణంలో నిర్వహించే ఈ శిబిరంలో శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు పాల్గొని వైద్య సేవలందిస్తారని పేర్కొన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు అందించనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు చేయనున్నట్లు ఏరియా మేనేజర్ కె.రమేష్, అసిస్టెంట్ మేనేజర్ పి.రాజేశ్వరరావు, పీఆర్వో ఎ.రాజు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం

- బీఆర్ అంబేడ్కర్‌కు విగ్రహానికి ఎమ్మెల్యే నివాళులు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: దేశ ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో ఉన్నారంటే కారణం రాజ్యాంగమేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. రాజ్యాంగాన్ని రచించింది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్న విషయం అందరికీ తెలిసినదేన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన జిల్లా కేంద్రంలో నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రధాన రహదారిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తోందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి అంబేడ్కర్ ఆలోచనా విధానంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముందుకు వెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ వి.గుర్రాజు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ గొర్లి మాధవరావు ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, స్టేట్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతానగరంలో..

దేశంలో ప్రతివ్యక్తి స్వేచ్ఛగా జీవించే హక్కును రాజ్యాంగంలో పొందుపర్చిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను నేటి తరం యువకులు స్ఫూర్తిగా తీసుకోవాలని సీతానగరం మండలం చినభోగిలి సర్పంచ్ కురమూరాధ పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ నేపథ్యంలో చినభోగిలి సచివాలయంలో సర్పంచ్ కె.రాధ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, రాజ్యాంగం ప్రతులను వినిపిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. బగ్గందొరవలస సెంటర్‌లో ఉన్న కృషి విద్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఉపాధ్యాయులు విద్యార్థులు నివాళులర్పించారు.


సీతానగరం: చినభోగిలిలో మాట్లాడుతున్న సర్పంచ్ కురమాన రాధ

పేదలకు 'పట్టా'భిషేకం


పేదలకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- భూ హక్కు పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

పార్వతీపురంటౌన్: నిరుపేదలకు భూ పట్టాలు పంపిణీ చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన పార్వతీపురం మండలంలోని వెంకటరాయుడుపేట, చందలంగి, గ్రామాల్లో నిరుపేద రైతులకు అతుకుబడి భూములకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మండలంలోని 3 పంచాయతీలకు చెందిన గ్రామాల్లోని 50 మంది లబ్ధిదారులకు 29.60 ఎకరాలకు సంబంధించి పట్టాలను పంపిణీ చేశామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను ఆర్థికంగా మెరుగైన స్థితికి చేర్చడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఈ భూ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మండల పరిధిలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి ఇప్పటికే పంపిణీకి అసైన్‌మెంట్ కమిటీల ఆమోదం తీసుకున్న అనంతరం అర్హులందరికీ డీపట్టా భూములను అందజేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివన్నారాయణ, వైస్ ఎంపీపీ బంకురు రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బి రమేష్, పార్టీ నాయకులు బలగ నాగేశ్వరరావు, మజ్జి శేఖర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా మంచినీటి పథకాలు

- నియోజకవర్గంలో రూ.21 కోట్లతో 126 పనులు

సీతానగరం: పార్వతీపురం నియోజకవర్గంలో స్వజలధార, జల్‌జీవన్ మిషన్ పథకం అమలు ద్వారా వేసవిలో తాగునీటి సమస్యకు చెక్ పడనుంది. గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం పూర్తవడం, జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటి కుళాయిల పనులు వేగవంతం చేసి తాగునీటి సమస్య పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా సుజల స్రవంతి, జలజీవన్ మిషన్ పథకాల ద్వారా ఓవర్ హెడ్ వాటర్‌ట్యాంక్‌లు, ఇంటింటి కుళాయిల పనులు జగనన్న ప్రభుత్వం వేగవంతం చేయడంతో మధ్యతరహా తాగునీటి పథకం పనులు, నదులపై ఉన్న భారీమంచి నీటి పథకాల మరమ్మతులు చకచకా జరుగుతున్నాయి. పార్వతీపురం


వెంకటాపురంలో ఇంటింటి కుళాయిలతో సరఫరా అవుతున్న నీరు


లచ్చయ్యపేటలో నిర్మించిన ఓవర్ హెడ్‌ట్యాంక్

నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో ప్రతిగ్రామంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటి కుళాయిల నిర్మాణం శరవేగంగా జరగడానికి ఉన్నతాధికారులు ప్రత్యేకచర్యలు చేపట్టారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల్లోని వివిధగ్రామాల్లో రూ.21 కోట్లతో ఇంటింటికుళాయిల నిర్మాణంతో పాటు స్పెషల్ గ్రాంట్‌తో ఓవర్‌హెడ్‌ట్యాంక్‌లు, పైప్‌లైన్లు వేసే పనులు శరవేగంగా చేస్తున్నారు. నియోజకవర్గానికి రూ.21 కోట్లతో 126 పనులు మంజూరు కాగా ఇప్పటికి 93 పనులు పూర్తయ్యాయి. 33పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

మంచినీటి సమస్య పరిష్కారం



ఏగోటివలసకు తాగునీటి కోసం నానా అవస్థలు పడ్డాం. గ్రామాల్లో తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి తక్షణమే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. గ్రామంలో ఇంటింటి కుళాయిల పనులు శరవేగంగా జరగడం వల్ల తాగునీరు సరఫరా జరుగుతోంది.

– యు. రాధాకృష్ణ సర్పంచ్ ఏగోటివలస

ఎమ్మెల్యే కృషితో నిధులు మంజూరు



ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించడానికి జగనన్న ప్రభుత్వం నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయడంతో అన్నిగ్రామాల్లో ఇంటింటి కుళాయిల పనులు జరుగుతున్నాయి. ఇప్పటికి సుజలస్రవంతి పథకం నిధులతో చేపట్టిన ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణం పూర్తయింది. జేజేఎం నిధులు రూ.21 కోట్లతో 126 గ్రామాల్లో ఇంటింటి కుళాయిల పనులు జరుగుతున్నాయి. ఇప్పటికి 93 పనులు పూర్తయ్యాయి. వచ్చే వేసవినాటికి పూర్తిస్థాయిలో మంచినీరు సమస్య పరిష్కారమవుతుంది.

– హనుమంతరావు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

వైభవంగా కార్తీక పౌర్ణమి దీపోత్సవం


దేవాంగుల వీధిలో సామూహిక పూజలు చేస్తున్న మహిళలు

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామంలో గల లక్ష్మీనారాయణస్వామి ఆలయం ప్రాంగణంలో కొలువైన అయ్యప్ప మంటపం వద్ద కార్తీకపౌర్ణమి పర్వదినం సందర్భంగా జ్యోతులు వెలిగించే కార్యక్రమం ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన ఉద్యోగులు, నిరుద్యోగులు, యువకులు గ్రామ పెద్దల సమక్షంలో గ్రామస్తులంతా సువర్ణముఖి నదీ తీరాన ఉన్న ఆలయ ప్రాంగణానికి చేరుకుని వేలాది మంది భక్తులు జ్యోతులు వెలిగించారు.


సీతానగరం: లక్ష్మీనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో జ్యోతులు వెలిగించిన భక్తులు

పార్వతీపురంలో..

పార్వతీపురం టౌన్: కార్తీక పౌర్ణమి పూజలను పట్టణంలోని మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని దేవాంగులవీధి, వైకేఎంకాలనీ, కొత్తవలస తదితర ప్రాంతాల మహిళలు సామూహికంగా పూజలు చేసి కథను ఆలకించారు. ఇంటి వద్ద ప్రత్యేకంగా లక్ష్మీదేవికి పూజలు చేసి ఇంటి పరిసరాలను దీపాలతో అలంకరించారు. అనంతరం చిన్నారులు, యువత బాణసంచా కాల్చారు.

పల్లెల పరిశుభ్రతతో ప్రజారోగ్యం

వంగర: పల్లెలు పరిశుభ్రంగా ఉంచగలిగితే ప్రజలు ఆరోగ్యంగా ఉండగలుగుతారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఎంపీటీసీ కరణం సుదర్శనరావు అన్నారు. మండలంలోని శ్రీహరిపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో చెత్తసేకరణ బుట్టల పంపిణీ ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని, ఇప్పటికే ప్రతీ గ్రామంలో గ్రీన్ అంబాసిడర్లను నియమించి, గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తోందన్నారు. ప్రజలు కూడా తమవంతు బాధ్యతగా ఈ బుట్టలలో తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా వేసి, గ్రీన్ అంబాసిడర్లకు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శనపతి సత్యారావు, రాష్ట్ర సాహితీ అకాడమీ డైరెక్టర్ బొంతు వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి జీవన్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలోని పక్కి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు చేతులమీదుగా గ్రామస్తులకు చెత్తబుట్టలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ బుట్టలలో తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా వేసి, ఇంటి వద్దకు వచ్చే గ్రీన్‌అంబాసిడర్‌కు ఇచ్చి, పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా వికసిత్ భారత్ సంకల్పయాత్ర

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ జమ్ము, దేరువాడ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, గిరిజనులకు కలిగే ప్రయోజనాలను వివరించేందుకు ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఉజ్వల, పీఎం ఆవాస్ యోజన, ఆహార భద్రత, సంపూర్ణ పోషకాహారం, జల్‌జీవన్, ఆయుష్మాన్ భారత్, పీఎం జన ఆరోగ్య యోజన, గరీబ్ కల్యాణ్ అన్న యోజన, దీనదయాళ్ అంత్యోదయ యోజన, పీఎం విశ్వకర్మ, పీఎం కిసాన్ సమ్మాన్, పోషణ అభియాన్, జన్‌ధన్ యోజన, జీవన్ జ్యోతి యోజన, తదిరర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సతివాడలో..

భామిని: మండలంలోని సతివాడ, పోలీస్ కోటలో ఆదివారం 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటి వల్ల గిరిజనులకు కలిగే లబ్ధిని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, ఈఓపీఆర్డీ కృష్ణారావు, సర్పంచ్‌లు పాశర్ల రామారావు, బిడ్డిక నారాయణ, తదితరులు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా బాలేరు వైద్యాధికారి డాక్టర్ దీపికా రాణి నేతృత్వంలో వైద్య సిబ్బంది గ్రామంలో వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

మన్యంలో పిక్నిక్‌ల సందడి

- ఆకట్టుకుంటున్న ఏజెన్సీ అందాలు
- అడ్వంచర్ పార్కు, జలపాతాలు, వ్యూ పాయింట్లకు పర్యాటకుల తాకిడి

సీతంపేట:

మన్యంలో వనభోజనాల సందడి ప్రారంభమైంది. ఏజెన్సీ ప్రాంతంలో ప్రకృతి అందాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. మెట్టుగూడ, సున్నపుగెడ్డ జలపాతాలకు, ఐటీడీఏ అడ్వెంచర్ పార్కుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. కుటుంబ సభ్యులతో కలిసి వనభోజనాలు చేసి సందడి చేస్తారు. అడ్వెంచర్ పార్కులోని జలవిహార్‌లో బోటుషికారు చేయవచ్చు. పిల్లల కోసం సైక్లింగ్, షూటింగ్, టాయ్ ట్రైన్, ఇతర సాహస క్రీడలు అందుబాటులో ఉన్నాయి. ఆడలి, పొల్ల, జగతపల్లి వ్యూపాయింట్ల నుంచి మన్యం అందాలను చూస్తూ ఆస్వాదించవచ్చు.

ఇలా చేరుకోవాలి..

సీతంపేట నుంచి కొత్తూరుకు వెళ్లే రహదారి మధ్య సీతంపేటకు మూడు కిలో మీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ పగోడాలు, పర్యాటకుల కోసం వెయిటింగ్ హాల్స్, మరుగుదొడ్లు వంటివి ఏర్పాటు చేశారు. అలాగే దోనుబాయి గ్రామానికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో సున్నపుగెడ్డ జలపాతం ఉంది. మేకవ గ్రామానికి సమీపంలో రోడ్డుదిగువన నడుచుకుంటూ రెండు కిలోమీటర్లు వెళ్లే సున్నపుగెడ్డను చేరుకోవచ్చు. అలాగే చంద్రమ్మగుడి కూడా పిక్నిక్ స్పాట్‌గా పేరుంది. ఆడలి, పొల్ల, జగతపల్లి వ్యూపాయింట్‌లు కూడా చూడవచ్చు. సున్నపుగెడ్డ నుంచి కొద్ది దూరంలోనే పొల్ల వ్యూపాయింట్ ఉంది. అలాగే సీతంపేట నుంచి సుమారు 7 కిలోమీటర్ల దూరంలో జగతపల్లి వ్యూపాయింట్ ఉంది. ఇది కూడా చూడడానికి ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. పాలకొండ నుంచి సీతంపేట వస్తుంటే మధ్యలో శంబాం రహదారి ఉంటుంది. శంబాం నుంచి ఆడలి వ్యూపాయింట్‌కు వెళ్లాల్సి ఉంటుంది.


ఆడలి వ్యూ పాయింట్


అడ్వంచర్ పార్కులోని జలవిహార్‌లో బోటుషికారు చేస్తున్న పర్యాటకులు


మెట్టుగూడ జలపాతం వద్ద స్నానాలు చేస్తున్న పర్యాటకులు

అప్రమత్తంగా ఉండాలి



పిక్నిక్‌కు వచ్చే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలి. ఘాట్‌రోడ్‌లో వాహనాల్లో ప్రయాణించేటపుడు జాగ్రత్తగా ఉండాలి. మద్యం సేవించి ఆయా ప్రాంతాల వైపు వెళ్లొద్దు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు. పర్యటకుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

– జీవీ కృష్ణారావు, పాలకొండ డీఎస్పీ

వసతులు కల్పించాం..



సీతంపేటలో ఎక్కువగా ఆకట్టుకునే ప్రదేశాలు ఉండడంతో పెద్ద సంఖ్యలో పర్యాటకులు వెళ్తుంటారు. ఏజెన్సీలో ఉన్న జలపాతాలు, పర్యాటక ప్రదేశాల్లో సందర్శకులకు అవసరమైన వసతులు కల్పించడం జరిగింది.

– నారాయణరావు, జిల్లా పర్యాటకశాఖ అధికారి

ముమ్మరంగా పంటకోత ప్రయోగాలు

పాలకొండ: మండలంలో పంటకోత ప్రయోగాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ముందుగా ఎంపిక చేసిన పొలాల్లో వ్యవసాయశాఖ, రెవెన్యూ, ఇన్సూరెన్స్ సిబ్బంది పంటకోత చేపట్టి దిగుబడి అంచనా వేస్తున్నారు. ప్రాంతాల వారీగా దిగుబడులు గుర్తించి నివేదికలు రూపొందిస్తున్నారు. పంటకోత ప్రయోగాల ఆధారంగా పంటబీమా వర్తిస్తుంది.

ఆశ్రమ పాఠశాలలో మాక్ పార్లమెంట్

సీతంపేట: రాజ్యాంగ దినోత్సవాన్ని పురష్కరించుకొని స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆదివారం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. పార్లమెంట్ కార్యకలాపాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు పార్లమెంట్ సభ్యుల మాదిరిగా పలు అంశాలపై చర్చించారు. హెచ్‌ఎం లిల్లీరాణి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతికవిలువలు పెంపొందించాలి

రాజాం సిటీ: ప్రాథమిక దశ నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలని వికాస తరంగిణి కేంద్ర కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.టి.వి రమణమూర్తి సూచించారు. స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో రామాయణంలోని బాలకాండలో ఉన్న 30వ సర్గ 16వ శ్లోకంలోని సన్నివేశాలపై చిత్రలేఖనం పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రామాయణంపై అవగాహన కల్పించేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రాముడు ఆదర్శప్రాయుడని, సత్యాన్ని, ధర్మాన్ని తప్పకుండా ఏ విధంగా మనిషి జీవించాలో మనకు తెలియజేశారన్నారు. ప్రతిఒక్కరూ సద్గుణాలను అలవర్చుకుని, సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి సీనియర్స్ విభాగంలో జరిగిన పోటీలో ఉట్ల ప్రసన్న (జెడ్పీహెచ్‌ఎస్, కంచరాం), మొగదాల సోనియా(జెడ్పీహెచ్‌ఎస్, కంచరాం), లోచర్ల గణేష్(ఉన్నత పాఠశాల, రాజాం)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి, బహుమతులు కైవసం చేసుకోగా, జూనియర్స్ విభాగంలో లోతుపల్లి ఉదయ్‌కుమార్(జెడ్పీహెచ్‌ఎస్, హొంజరాం), కె.ఢిల్లీశ్వరరావు(జెడ్పీహెచ్‌ఎస్, బొద్దూరు), కె.నిరీష (జెడ్పీహెచ్‌ఎస్, డోలపేట)లు తొలి మూడు స్థానాల్లో నిలిచి, బహుమతులు దక్కించుకున్నారు. ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి, సీనియర్స్ విభాగంలో బొండపల్లి సిరి జాహ్నవి(సన్ స్కూల్), దుప్పలపూడి ధనసాయి (సన్ స్కూల్), మెరుగు సుమిత్ర (సన్‌స్కూల్)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. జూనియర్స్ విభాగంలో దార వేదవర్షిత (సన్ స్కూల్), మెరుగుల వెంకటేష్ (సన్ స్కూల్), మానం హర్షిణిప్రియ (జ్ఞానజ్యోతి)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు పైడిరాజు, నీలకంఠం, అప్పలనాయుడు, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.